

ప్రత్యేక పాలన వైపు అడుగులు

ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచ్‌ల పదవీ కాలం

- అధికారుల జాబితా రూపకల్పనకు ఆదేశాలు జారీ
- పల్లె పాలనకు కసరత్తు చేస్తున్న యంత్రాంగం
- ప్రభుత్వ ఉత్వర్వులే తరువాయి...
- జిల్లాలో 281 గ్రామ పంచాయతీలు
- పెండింగ్ బిల్లులపై సర్పంచ్‌ల ఆవేదన

జఫర్‌గఢ్, జనవరి 28 : గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలనకు రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యుల పదవీ కాలం ఫిబ్రవరి 1తో ముగియనుంది. నిర్ణీత కాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటే జనవరి మొదటి వారంలోనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలి. కానీ ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి ప్రక్రియ చేపట్టలేదు. మరో ఐదు రోజుల గడువు మాత్రమే మిగలడంతో ఇప్పట్లో సర్పంచ్ ఎన్నికలు జరగవనేది తేలిపోయింది. పంచాయతీల వారీగా ప్రత్యేక అధికారుల నియామకానికి అధికార యంత్రాంగం తగు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు మండలాల వారీగా ఆయా శాఖల అధికారుల వివరాలు అందించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ కావడంతో జాబితాలను నివేదించారు.

281 పంచాయతీలకు ప్రత్యేకాధికారులు...

2019లో పంచాయతీ ఎన్నికలకు జనవరి 1న ఎన్నికల షెడ్యూల్, నోటిఫికేషన్ వెలువడింది. జిల్లాలో జనవరి 21, 25, 30వ తేదీల్లో మూడు దశల్లో ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి 1న సర్పంచ్‌లు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. తాజాగా పదవీకాలం ముగియనుండడంతో ప్రత్యేక పాలనలో భాగంగా జిల్లాలోని 281 గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించనున్నారు. అయితే ఇందులో జిల్లాలో 11 సర్పంచ్, 79 వార్డు సభ్యుల స్థానాలు పలు కారణాల వల్ల ఖాళీ ఏర్పడ్డాయి.. ఆ పదవులకు చాలా కాలంగా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదు.


మండల స్థాయి అధికారులకే బాధ్యతలు...

మరో ఐదు రోజుల్లో పాలక మండళ్ల పదవీ కాలం ముగిసిపోనుండడంతో గ్రామ పంచాయతీలకు మండల స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించనున్నారు. కార్యదర్శుల కంటే పైహోదాలో ఉండే వారినే ప్రత్యేకాధికారులుగా నియమించాల్సి ఉంటుంది. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఏయే శాఖల, ఏ స్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తారనేది తెలియాల్సి ఉంది. ఇందులో భాగంగా మండల పరిషత్, రెవెన్యూ, వ్యవసాయ, విద్య, నీటి పారుదల, మత్స్యశాఖ, గ్రామీణాభివృద్ధి, ఉద్యానవన, పశుసంవర్ధక, సంక్షేమ శాఖల అధికారుల వివరాలను సేకరించి జాబితాలను మండల అధికారులు పంపించగా.. ఉన్నతాధికారుల ద్వారా వాటిని ప్రభుత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది. గతంలో వలె ఒక్కో అధికారికి రెండు మూడు పంచాయతీల బాధ్యతలు ఇవ్వకుండా.. ఒక్క పంచాయతీకే పరిమితం చేయాలని సర్కారు యోచిస్తున్నట్లు తెలిసింది. ఈనెలాఖరు లోగా ప్రత్యేకాధికారుల నియామక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. అయితే ప్రభుత్వం ప్రత్యేక పాలన అమలుకు శ్రీకారం చుడితే ప్రస్తుతం ఉన్న పంచాయతీ కార్యదర్శులు కార్యనిర్వహణాధికారులుగా ఉంటారు.

సార్వత్రిక ఎన్నికల తరువాతే ..?

రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని పనిచేస్తోంది. మెజార్టీ స్థానాలను కైవసం చేసుకునేందుకు కార్యాచరణ సిద్ధం చేసుకుంటోంది. ఆరు గ్యారంటీల అమలుకు దరఖాస్తులను స్వీకరించిన విషయం విదితమే. కొద్ది రోజుల్లో ఇంటింటి సర్వే చేపట్టి ప్రభుత్వ మార్గదర్శకాలు, దరఖాస్తుల ఆధారంగా అర్హులను ఎంపిక చేయనున్నట్లు తెలుస్తోంది. వీటిపైనే ప్రత్యేక శ్రద్ధ పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించడం లేదనే ప్రచారం జరుగుతోంది. అంతేకాకుండా గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల రిజర్వేషన్లపై సందిగ్ధత నెలకొంది. ఈ రిజర్వేషన్లను పదేళ్ల కాలానికి వర్తించేలా గత ప్రభుత్వం పంచాయతీ రాజ్ చట్టం చేయడంతో.. పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలు నిర్వహిస్తారా..? లేదా మార్పులు ఉంటాయా ? వంటి సందేహాల నేపథ్యంలో పార్లమెంటు ఎన్నికల తరువాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తారనే వాదన వినిపిస్తోంది.

అభివృద్ధి పనులకు సంబంధించి సర్పంచ్‌లకు బిల్లులు రావాల్సి ఉంది. గ్రామ స్థాయిలో చాలా వరకు పనులను వీరే చేపట్టారు. కొన్ని పనులకు సంబంధించి తరువాత బిల్లులు వస్తాయనే ఉద్దేశంతో సొంత డబ్బులు అప్పులు చేసి ఖర్చు చేశారు. ఇలా ఒక్కో సర్పంచ్‌కి ఆయా పంచాయతీని బట్టి రూ.2 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు వివిధ అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రావాల్సి ఉంది. గత ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించలేదనే విషయమై పలువురు సర్పంచ్‌లు ఆయా సందర్భాల్లో ఆవేదన వ్యక్తం చేయడం, జిల్లా కలెక్టర్లు, గత ఎమ్మెల్యేలు, మంత్రులకు పలుమార్లు విన్నవించుకున్న విషయం విదితమే. కొన్ని నిధులు అందినా.. ఇంకా సింహభాగం రావాల్సి ఉంది. తమకు రావాల్సిన బిల్లులను ఇవ్వడంతో పాటు తమకు పాలనా పరంగా మరికొంత సమయాన్ని ఇచ్చి.. గ్రామాభివృద్ధికి పాటుపడే అవకాశం ఇవ్వాలని నూతన సర్కార్‌ను కోరుతూ జఫర్‌గఢ్ మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.





ప్రభుత్వ ఆదేశాలు రావాల్సి ఉంది...

రంగాచారి, జిల్లా పంచాయతీ అధికారి, జనగామ

ప్రత్యేక పాలన అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ఫిబ్రవరి 1వ తేదీతో పంచాయతీ పాలక మండళ్ల పదవీ కాలం ముగియనుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయా మండలాల్లోని వివిధ శాఖల అధికారుల జాబితాలను నివేదించాం. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 281 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నాం. ప్రత్యేక అధికారుల పాలన అమల్లోకి వస్తే ఇందుకు ముందస్తు ఏర్పాట్లు చేపట్టాం. ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు రాలేదు.



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మేడారంలో భక్తజన సందోహం

జాతరకు ముందే కోలాహలం

- కిక్కిరిసిన వనదేవతల గద్దెలు
- వనదేవతలను సందర్శించుకున్న సుమారు 4 లక్షల మంది
- మొక్కులు చెల్లించుకున్న ప్రముఖులు



మేడారం, జనవరి 28: తాడ్వాయి మండలంలోని వనదేవతల సన్నిధి మేడారం కిటకిటలాడింది. సమక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తజనం భారీగా తరలివచ్చారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి జరగనుండగా ముందస్తుగానే తల్లులలకు మొక్కులు చెల్లించుకున్నారు. వారాంత సెలవు కావడంతో భక్తులు తండోపతండాలుగా తరలివచ్చారు. సుమారు 4 లక్షల మంది వనదేవతలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగు లో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. శివసత్తుల పూనకాలు, డోలు వాయిద్యాల మధ్య సమ్మక్క, సారలమ్మ నామాన్ని జపిస్తూ క్యూలైన్ల ద్వారా తల్లుల గద్దెలకు చేరుకున్నారు. పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీరె సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) సమర్పించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. కోరికలు తీర్చాలని అమ్మవార్లను వేడుకున్నారు. బలి మొక్కులు సమర్పించి మేడారం పరిసరాల్లో చెట్లకింద వంటలు చేసుకొని బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు.

తల్లులను దర్శించుకున్న ప్రముఖులు

వనదేవతలను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వర్‌రావు, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, సీసీఎల్‌ఏ జాయింట్ సెక్రటరీ సవిత, యాదాద్రి అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సీఎం పీఆర్‌వో శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్ఈ విజయభాస్కర్, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ ఈఈ హేమలత దర్శించుకున్నారు. ప్రత్యేక పూజల అనంతరం తల్లుల ప్రసాదాలను పూజారులు వారికి అందజేశారు. కండువాలతో సత్కరించారు.



జంపన్నవాగులో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు చేస్తున్న భక్తులు

సమయం లేదు.. పనుల్లో వేగం పెంచండి..

- మహాజాతర ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయండి
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క
- మేడారంలో అధికారులతో సమీక్ష



జిల్లా కలెక్టర్, ఎస్పీ అధికారులతో సమావేశమైన మంత్రి సీతక్క

మేడారం, జనవరి 28: మహాజాతర సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో మేడారంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. జాతరకు సమయం దగ్గరపడుతున్న కొద్దీ.. భక్తుల రాక పెరుగుతోందని, వారికి మౌలిక సౌకర్యాలు కల్పించాలని అన్నారు. మంత్రి సీతక్క ఆదివారం రాత్రి 9 గంటల తర్వాత పర్యటించారు. పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శబరీశ్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఆయా శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ప్రధానంగా అంతర్గత, లింకు రోడ్ల పనులు కొనసాగుతుండడంవల్ల ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోందని, భక్తులు కూడా అసౌకర్యానికి గురవుతున్నారని సీతక్క అన్నారు. నాణ్యతలో రాజీ పడకుండా వారంలోగా రోడ్ల పనులన్నింటినీ పూర్తిచేయాలని ఆర్అండ్‌బీ, పీఆర్ అధికారులకు సూచించారు. జంపన్నవాగులో భక్తుల పుణ్యస్నానాల కోసం సౌకర్యాలను విస్తరించాలని, సాధ్యమైనన్ని ఎక్కువ బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ అందుబాటులోకి తేవాలని అన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం విషయంలో అలసత్వం వహించొద్దని, వీలైనన్ని ఎక్కువ ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ఈ సమీక్షలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్, పీఆర్ ఈఈ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల విడిది షెడ్లను ప్రారంభించిన మంత్రి

గోవిందరావుపేట/తాడ్వాయి : మేడారం భక్తుల కోసం గోవిందరావుపేట మండలం చల్వాయి, తాడ్వాయి మండల కేంద్రాలలో రూ.కోటి 50లక్షల చొప్పున వ్యయంతో నిర్మించిన విడిది షెడ్లను రాష్ట్ర మంత్రి సీతక్క ఆదివారం ప్రారంభించారు. గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవం కోసం వచ్చిన గర్భిణుల కోసం నిర్మించిన గదిని ప్రారంభించారు. అదే విధంగా దుంపెల్లిగూడెంలో రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామపంచాయతీ భవనానికి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమాలలో ఐటీడీఏ పీవో అంకిత్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఓ స్పీడ్ బ్రేకర్

- రేవంత్‌రెడ్డి దిగజారుడు భాష దురదృష్టకరం
- బీఆర్ఎస్‌ను కనుమరుగు చేయడం ఎవరి తరం కాదు
- స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



పాలకుర్తిలో మాట్లాడుతున్న కడియం శ్రీహరి

పాలకుర్తి, జనవరి 28 : రాష్ట్రంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఓ స్పీడ్ బ్రేకర్ లాంటిదని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ జెండాను దయాకర్‌రావు ఎగురవేశారు. అనంతరం నియోజకవర్గ స్థాయి ముఖ్యకార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా కడియం శ్రీహరి హాజరై మాట్లాడారు. తమకు భవిష్యత్ లేదని బీఆర్ఎస్ కార్యకర్తలు కుంగిపోవద్దని, భవిష్యత్‌లో వచ్చేది మళ్లీ తామేనని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలో గెలుపు ఓటములు సహజం అని, 2028లో రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలల్లో ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలు మాత్రమే కాదని మొత్తం 420 హామీలను ఇచ్చిందని వాటిని నిలబెట్టుకోవాలని సూచించారు.

ఎన్నికల ముందు రేవంత్‌రెడ్డి రైతులు రుణాలు తీసుకోని వారుంటే బ్యాంకులకు వెళ్లి రూ. 2 లక్షలు వరకు రుణాలు తీసుకోండి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రుణమాఫీపై మొదటి సంతకం చేస్తానని రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. 50 రోజులు దాటిన రైతుబంధు ఇప్పటి వరకు పూర్తిస్థాయిలో ఇవ్వలేదని అన్నారు. ముఖ్యమంత్రి మాట్లాడిన భాష చూస్తే సిగ్గేస్తుందన్నారు. ముఖ్యమంత్రి హోదాలో హుందాతనంగా ఉండాలని సూచించారు.. మాజీ సీఎం కేసీఆర్‌ను చార్లెస్ శోభరాజ్, అని, కేటీఆర్, హరీశ్‌రావును బిల్లా, రంగాలని వాఖ్యలు చేయడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సభ్యత, సంస్కారం లేదని తెలిపారు. చార్లెస్ శోభరాజ్, బిల్లా, రంగా కంటే రేవంత్‌రెడ్డి చరిత్ర పెద్దదని విమర్శించారు. మాజీ మంత్రి దయాకర్‌రావు ఓడిపోతాడని ఏనాడు అనుకోలేదని అన్నారు. పాలకుర్తి నాలుగు కూడళ్ల అభివృద్ధి చూస్తే దయాకర్‌రావుకు ఓటమి ఉండొద్దని అన్నారు. నిత్యం ప్రజల మధ్య కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటే తిరిగి అధికారం బీఆర్ఎస్‌దేనని అన్నారు. చిత్తశుద్ధితో ప్రతి కార్యకర్త పని చేయాలని కోరారు. 1989లో ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఐదేళ్ల కాలంలో కాంగ్రెస్ పాలనను చూసిన ప్రజలు తిరిగి 1994లో కమ్యూనిస్టులతో కలిసి టీడీపీ పార్టీని ఎన్టీరామారావును అధికారంలోకి తీసుకువచ్చిన ప్రజలు బ్రహ్మాండమైన మెజారిటీతో గెలిపించారని అన్నారు.

రాష్ట్రంలో 2028లో భారత రాష్ట్ర సమితి అధికారంలోకి వస్తుందని అన్నారు. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కష్టపడి పని చేయాలని కోరారు. అధికార కాంగ్రెస్ పార్టీ కేసులు పెడితే ఎవరికి భయపడేది లేదని హెచ్చరించారు. మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ ఇన్నిసార్లు గెలిపించినట్లే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు కష్టపడిపని చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల కోసం ఎట్లా పని చేయాలని దిశ నిర్దేశం చేశారు.

మాజీ మంత్రి ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అలవి కానీ హామీలతో కాలయాపన చేస్తుందేతప్ప ఎలాంటి అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టదని విమర్శించారు. ఆరు గ్యారంటీ పథకాలు కాదని మొత్తం 420 పథకాలని అన్నారు. ఈ పథకాలన్నింటిని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు, మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనందభాస్కర్, నవీన్, సుందర్‌రామిరెడ్డి, వంగపల్లి శ్రీనివాస్, గాంధీ నాయక్, ఐలయ్య, రాంచంద్రయ్య శర్మ, జడ్పీటీసీ శ్రీనివాస్, యాకాంతరావు, ముస్కు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కూలీల కొరతతో చేనులోనే ఉండిపోయిన పత్తి

- తగ్గిన దిగుబడి.. రైతులకు కలిసిరాని కాలం
- సరైన సమయంలో వర్షాలు లేక దిగుబడిపై ప్రభావం
- అప్పుల పాలవుతున్న అన్నదాతలు

పడిపోయిన పత్తి ధర

రఘునాథపల్లి, జనవరి 28: ఆరుగాలం కష్టపడుతున్న అన్నదాతలకు కాలం కలిసి రాకపోవడంతో నష్టాలే మిగులుతున్నాయి. అసలే దిగుబడి లేక నష్టాలను చవి చూస్తున్న రైతులకు పత్తి ధర పడిపోవడంతో ' మూలిగే నక్క మీద తాటి పండు పడ్డట్టు ' అయింది. పంట పెట్టుబడుల కోసం తెచ్చిన అప్పులు.. కుప్పలుగా మారాయి తప్ప.. కనీసం పెట్టుబడులు కూడా రాలేని దుస్థితి నెలకొంది. జిల్లాలో అధిక శాతం మంది రైతులు పత్తి పంట సాగు చేశారు. ఈ సారి సమయానికి అనుకూలంగా వర్షాలు లేక పత్తి దిగుబడి పూర్తిగా తగ్గింది. దిగుబడి తగ్గడంతో డిమాండ్ పెరిగి ఎక్కువ ధర పలుకుతుందనుకున్న రైతుల ఆశలు..ఆడియాశలుగానే మిగిలిపోయాయి. పత్తి పంట సాగుకు ఒక్కో ఎకరానికి సుమారు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేయగా, కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి తలెత్తడంతో అన్నదాతలు దిగులు పడుతున్నారు. పత్తి పంట చేతికొచ్చే దశలో ఒక్క వర్షం కూడా కురువకపోవడంతో దిగుబడి అమాంతం తగ్గింది. పంట సాగు సమయంలో వర్షాలు ఆలస్యంగా కురువడం, ఆ తర్వాత సరైన సమయంలో వర్షాలు లేక రైతులు ఆశించిన స్థాయిలో పత్తి కాయలు కాయకపోవడంతో దిగుబడి చాలా వరకు తగ్గింది.

-పెరిగిన కూలీల రేట్లు..

పత్తి పంట ఏరివేత సీజన్ కావడంతో రైతులకు కూలీలు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. పత్తి ఏరేందుకు వస్తున్న కూలీలు కిలో పత్తి ఏరితే రూ.10 నుంచి రూ.15 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అసలే పత్తి దిగుబడి లేక సతమతమవుతుంటే కూలీ రేట్లు పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పత్తి ఏరేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకరావడం వల్ల అదనంగా రవాణా చార్జీలను కూడా రైతులే భరించాల్సి వస్తుంది. ప్రస్తుతం పత్తి ఏరివేత చివరి దశకు చేరడంతో కూలీల కొరత వేదిస్తోంది. కూలీ రేట్లు అధికంగా పెరగడం, ఈ ఏడాది పత్తికి ఆశించిన స్థాయిలో ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి క్వింటాల్‌కు గత సంవత్సరం రూ.7800 వరకు ధర పలుకగా, ఈ ఏడాది మాత్రం క్వింటాల్‌కు రూ.6700 మాత్రమే ధర పలుకుతుంది. దీనికి తోడు పత్తి దిగుబడి కూడా తగ్గడంతో పంటకు పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు ఉన్నాయని, మరో వైపు కూలీలు దొరక్క చేలల్లోనే పత్తి ఉడిపోతోందని రైతులు వాపోతున్నారు.



పెట్టుబడులు రాక అప్పులు మిగిలాయి

పన్నాల వెంకటరమణ, దాసన్నగూడెం

నాకున్న నాలుగు ఎకరాలలో పత్తి పంట వేశాను. ఈ సారి సమయానికి అనుకూలంగా వర్షాలు పడకపోవడంతో పత్తి దిగుబడి తగ్గింది. దీంతో పత్తి పంట సాగు కోసం తెచ్చిన పెట్టుబడులు కూడా రాలేదు. పెట్టుబ డుల కోసం తెచ్చిన అప్పులు అలాగే మిగిలిపోయాయి. ప్రభుత్వం స్పందించి పత్తి రైతులను అదుకోవాలి.

దిగుబడితో పాటు ధర కూడా తగ్గింది

- కట్కూరి హరీష్, కోమల్ల



ఈ సారి వాతావరణం అనుకూలించక పోవడంతో పత్తి పంట సాగు చేసిన రైతులకు దిగుబడి తగ్గింది. ఐదెకరాల్లో పత్తి పంట సాగు చేశాను. సరైన సమయంలో వర్షాలు కురియక పోవడం వల్ల ఆశించిన స్థాయిలో దిగుబడి రాకపోవడానికి తోడు మార్కెట్లో పత్తి ధర కూడా పడిపోవడం మా పాలిట శాపంగా మారింది. పెట్టుబడుల కోసం తెచ్చిన రూ.80 వేల అప్పులో సగం కూడా తీర్చలేక పోయాను. మిగిలిన అప్పుకు తోడు వడ్డీ కట్టలేక పోవడం వల్ల అసలుతో పాటు వడ్డీ డబ్బులు తడిసి మోపెడవుతున్నాయి. పత్తి పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

ప్రజలకు నాసిరకం బియ్యం సరఫరా

కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌కు వినియోగదారుల మండలి ప్రతినిధుల ఫిర్యాదు

హనుమకొండ, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలో పౌరసరఫరాల శాఖ బియ్యం సరఫరాలో పాల్పడుతున్న అవతవకలపై వినియోగదారుల మండలి ప్రతినిధులు న్యూఢిల్లీలోని కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి పియూష్ గోయల్‌కు ఆదివారం ఫిర్యాదు చేశారు. పౌర సరఫరాల శాఖ అధికారులు మండల లెవల్ స్టాక్ పాయింట్ల నుంచి వివిధ చౌకడిపోఆల ద్వారా వినియోగదారులకు నాసిరకం, దొడ్డు బియ్యం సరఫరా చేస్తూ బియ్యాన్ని సేకరిస్తున్న రైస్ మిల్లర్లకు మేలు రకం బియ్యం ధర చెల్లిస్తున్నారని ఆ ఫిర్యాదులు జాతీయ వినియోగదారుల మండలి ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లాలో సివిల్ సప్లయిస్ గోదాములకు మిల్లర్లు ఇచ్చిన బియ్యం శాంపిళ్లను ప్రదర్శించడం లేదని, గోదాములు ఇన్‌చార్జిలు, ఫుడ్ ఇన్స్‌పెక్టర్లు, నాసిరకం బియ్యం బస్తాలకు ఫోర్టిఫైడ్ బియ్యం లేబుళ్లు వేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై తెలంగాణ ఆహార భద్రతా కమిషన్‌కు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార భద్రతా చట్టం-2013 నిబంధనలు తప్పనిసరిగా అమలు జరిగేలా చూడాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు కేంద్ర మంత్రి పియూష్ గోయల్‌ను కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి విచారణకు ఆదేశించారని వారు తెలిపారు.



న్యూఢిల్లీలో కృషి భవనం ముందు వినియోగదారుల మండలి ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న జన్ను సాంబయ్య

పేదల సమస్యలపై రాజీలేని పోరాటం

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య

వడ్డెపల్లి, జనవరి 28: పేద ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు చేయడమే తమ పార్టీ ఎజెండా అని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ తెలంగాణ (బొజ్జా తారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య అన్నారు. ఆదివారం హనుమకొండ రాంనగర్‌లోని కార్యాలయంలో నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని, స్వయం ఉపాధి కల్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాల్లో భారత రాజ్యాంగ పీఠిక ముద్రించాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా జన్ను సాంబయ్య, రాష్ట్ర చైర్మన్‌గా రెడ్డిమల్ల శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా బండి మొగిలి, మైదం జైపాల్, ఉపాధ్యక్షులుగా కొప్పుల రామారావు, నక్క భిక్షపతి, నాగెల్లి కోమల, రెడ్డిమల్ల పార్వతి, ప్రధాన కార్యదర్శిగా వి.స్వర్ణలత ఎన్నికయ్యారు. రాష్ట్ర కార్యదర్శిగా జమ్మల నాగరాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా బొచ్చు సాంబయ్య, బొడ్డు సత్యనారాయణలను ఎన్నుకున్నారు.

పులిమడుగును సందర్శించిన డీఎఫ్‌వోలు



పులిమడుగును సందర్శిస్తున్న డీఎఫ్‌వోలు రవి కిరణ్, అర్పణ

గూడూరు (మహబూబాబాద్ జిల్లా), జనవరి 28 : గూడూరు అటవీశాఖ పరిధిలోని కార్లాయి సెక్షన్ పరిధిలోని పులి మడుగును మహబూబాబాద్ డీఎఫ్‌వో రవికిరణ్, వరంగల్ డీఎఫ్‌వో అర్పణ ఆదివారం సందర్శించారు. పులిమడుగులో ఇటీవల నిర్వహించిన క్యాంపెన్ క్వాటర్‌ను పరిశీలించి పులిమడుగులో బోటింగ్ చేశారు. అటవీ వనరులు ఆక్రమణకు గురికాకుండా ఉండేందుకు అటవీశాఖ ఇటీవల ఈ క్వార్టర్‌ను నిర్మించిన సంగతి తెలిసిందే. కాగా, ఒకేశాఖలో ఒకేక్యాడర్‌లో పని చేస్తున్న ఈ ఇరువురు డీఎఫ్‌వోలు దంపతులు కావడం విశేషం.

10 కిలోల గంజాయి స్వాధీనం

వరంగల్‌సిటీ, జనవరి 28: ఎక్సైజ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు గంజాయి నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా ఆదివారం వరంగల్ రైల్వే స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో కోణార్క్, సింగరేణి ప్యాసింజర్, సీటీటీ రైళ్లలో తనిఖీలు చేపట్టారు. రైలు ద్వారా ఎండు గంజాయిని రవాణా చేస్తున్న ఒడిషా రాష్ట్రానికి చెందిన సంజయ్ నాయక్‌ను పట్టుకుని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 10 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఖిలావరంగల్ ఎక్సైజ్ సీఐ బి.చంద్రమోహన్ తెలిపారు. ఈతనిఖీల్లో సీఐ నీరజ, ఖిలావరంగల్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా సేవలు పొడిగింపు

- వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు..
- ఇంటి వద్దనే శిశు ఆధార్ ఉచితం
- విదేశాలకు అందుబాటు ధరలతో పార్సెల్స్

గిర్మాజిపేట(వరంగల్), జనవరి 28: ఉత్తరాలు, పార్సెల్స్, బ్యాంకింగ్, జీవిత బీమా పథకాల సేవలను ప్రజలకు అందచేస్తున్న వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను ప్రజలకు మరింతగా అందుబాటులోకి తీసుకువచ్చింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పోస్టాఫీసులు రోజుకు 8 గంటలు పనిచేస్తుండగా వరంగల్‌లోని హెడ్‌పోస్టాఫీసు 12 గంటలు పనిచేస్తూ ప్రజలకు మరింత విస్తృతంగా తపాలా సేవలను అందచేస్తోంది. అంతేకాదు 5 ఏళ్ల లోపు పిల్లలకు ఇంటి వద్దనే ఉచితంగా పోస్టుమన్ ద్వారా శిశు ఆధార్ నమోదు సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. వరంగల్ రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న హెడ్‌పోస్టాఫీసు సేవలు ఇలా వున్నాయి.

తపాలా సేవలివే..

వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో పలురకాల తపాలా సేవలు లభిస్తున్నాయి. రెవెన్యూ, పోస్టల్ స్టాంపుల విక్రయం, దేశ, విదేశాలకు ఉత్తరాలు, పార్సెల్స్ పంపిణీ, ఇండియన్ పోస్టల్ బ్యాంకింగ్, తపాలా సేవింగ్ పథకాలు, చిన్నమొత్తాల పొదుపు పథకాలు, తపాలా బీమా పథకాలు ప్రజలు పొందుతున్నారు.

ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు..

హెడ్‌పోస్టాఫీసు పనివేళలు గతంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఉండేవి. ఈ సమయంలోనే ప్రజలు తపాలా సేవలు పొందేవారు. అయితే సాయంత్రం 5.30 గంటలు దాటితే హెడ్‌పోస్టాఫీసు మూసివేసేవారు. దీంతో తపాలా సేవలు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీన్ని గుర్తించిన తపాలా శాఖ రాష్ట్రంలో సికింద్రాబాద్, వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను ప్రస్తుతం 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పొడిగించింది. ఈ మేరకు వరంగల్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ స్వామి వెంకటలక్ష్మినరసింహరావు వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పనివేళలను ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు హెడ్‌పోస్టాఫీసు పనిచేస్తున్నది.

ఇంటి వద్దనే శిశు ఆధార్ నమోదు

తపాలాశాఖ ఇంటి వద్దనే పోస్టుమన్ ద్వారా ఉచితంగా శిశువుల ఆధార్ నమోదు చేస్తోంది. ఇందుకుగాను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పరిధిలోని పోస్టుమన్‌లకు ఆధార్ నమోదుపై శిక్షణ ఇచ్చారు. 0 నుంచి 5 సంవత్సరాల శిశువుల ఆధార్ నమోదు కోసం తల్లిదండ్రులు ఆధార్ సెంటర్‌కు వెళ్లాల్సిన అవసరం లేదు. తమ ప్రాంతానికి వచ్చే పోస్టుమన్‌ను తల్లిదండ్రులు కలిసి శిశువులకు కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవచ్చు. పోస్టుమన్‌లు తమ వద్ద ఉన్న సెల్‌ఫోన్ ద్వారా తల్లిదండ్రుల సమాచారం, ఆధార్‌కార్డుల సమాచారంతో 0 నుంచి 5 సంవత్సరాల శిశువుల ఆధార్ నమోదు ఉచితంగా చేస్తారు. ఇందుకు గాను ఎలాంటి డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదు.



వరంగల్ హెడ్‌పోస్టాఫీసు

పోస్టాఫీసులో ఆధార్ సేవా కేంద్రం

వరంగల్ హెడ్‌పోస్టాఫీసులో ప్రత్యేకంగా ఆధార్ సేవా కేంద్రం పనిచేస్తోంది. ఇందులో కొత్తగా ఆధార్ నమోదు మాత్రం ఉచితంగా చేస్తారు. అయితే ప్రస్తుత ఆధార్ కార్డులో పేర్లు, ఇంటిపేర్లు, చిరునామా, పుట్టిన తేదీ, ఫొటో, వేలిముద్రలు తదితర సవరింపులను మాత్రమే ఆధార్ సంస్థ నిర్ణయించిన ఫీజుతో చేస్తారు. ప్రస్తుత ఆధార్‌లో ఇంటి పేరు, పేరు, పుట్టిన తేదీ, చిరునామా తదితర మార్పుల కోసం తప్పనిసరిగా సంబంధిత సర్టిఫికెట్ వెంట తెచ్చుకోవాల్సి ఉంటుంది. పుట్టిన తేదీ సవరణకు విద్యాసంస్థ, మునిసిపల్ బర్త్ సర్టిఫికెట్, పాస్‌పోర్టుతో చేసుకోవచ్చు. ఈ ఆధార్ సెంటర్ కూడా ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేయనుంది. ఆధార్ డౌన్‌లోడ్, ప్రింట్‌కు రూ.30 చెల్లించాలి.

అందుబాటు చార్జీలతో పార్సెల్స్

విదేశాలలో ఉంటున్న తమ కుటుంబ సభ్యులకు అవసరమైన వస్తువులు, మందులు, పిండివంటలు తదితర పార్సెల్స్‌ను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్‌లోని ప్రత్యేక పార్సెల్ కేంద్రం ద్వారా పంపవచ్చు. ప్రయివేట్ కొరియర్ సర్వీసుల కంటే తక్కువ చార్జీలు ఉన్నాయని తపాలా అధికారులు చెబుతున్నారు. నామమాత్రపు చార్జీతో అధునాతన ప్యాకింగ్



యంత్రంతో పార్సెల్స్‌ను ప్యాకింగ్ చేస్తున్నారు. ప్యాకింగ్ సైజ్ మేరకు చార్జి ఉంటుంది. ప్రతి అర కిలో(500 గ్రాములు)కు అమెరికాకు రూ.1,550, కెనడాకు రూ.1,180, ఆస్ట్రేలియాకు రూ.975, యూకేకు రూ.1,570 చార్జి ఉంటుంది. ప్రపంచంలోని దాదాపు అన్ని దేశాలకు తపాలా శాఖ విదేశీ పార్సెల్స్ సదుపాయం ఉందని అధికారులు చెబుతున్నారు.

తపాలా బీమా పథకాలు

సామాన్య, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో వివిధ జీవిత, ప్రమాద బీమా పథకాలను తపాలా శాఖ అమలు చేస్తోంది. టాటా, ఏజీ సహకారంతో రూ.10 లక్షలు, రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా పాలసీని అమలు చేస్తోంది. 18 నుంచి 65 సంవత్సరాల లోపు కలిగిన వారు సంవత్సరానికి రూ.520 చెల్లిస్తే రూ.10 లక్షల యాక్సిడెంటల్ బీమా, రూ.320 చెల్లిస్తే రూ.5 లక్షల యాక్సిడెంటల్ బీమా వర్తిస్తుందని తపాలా అధికారులు తెలిపారు. అలాగే నీవా బుపా హెల్త్ ఇన్సురెన్స్ సంస్థతో కలిసి తపాలా శాఖ సంవత్సరానికి రూ.755 ప్రీమియంతో రూ.15లక్షల హెల్త్ ఇన్సురెన్స్ పాలసీని అమలు చేస్తోంది. ఇవే కాకుండా సేవింగ్ అకౌంట్‌లు, డిపాజిట్ పథకాలతో పిల్లలకు సుకన్య సమృద్ధి యోజన, సీనియర్ సిటిజన్‌లు, మహిళల కోసం ప్రత్యేక డిపాజిట్, సేవింగ్, నెలవారి ఆదాయం స్కీంలను తపాలా శాఖ అమలు చేస్తున్నది.

తపాలా సేవలు వినియోగించుకోండి

ఎస్‌వీఎల్ఎన్ రావు, పోస్టల్ సూపరింటెండెంట్



ప్రజలకు మరింత మెరుగైన తపాలా సేవలను అందించేందుకు గాను వరంగల్ హెడ్‌పోస్టాఫీసు పని వేళలను 12 గంటలకు పెంచాం. ప్రతి రోజు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రజలు హెడ్‌పోస్టాఫీసులో తపాలా సేవలు పొందవచ్చు. తమ ప్రాంత పోస్టుమన్‌ల ద్వారా ఉచితంగా ఇంటి వద్దనే శిశు ఆధార్ నమోదును తల్లిదండ్రులు వినియోగించుకోవాలి. అలాగే తపాలా బ్యాంకింగ్, జీవిత, ప్రమాద బీమా పథకాలు, అందుబాటు చార్జీలతో విదేశాలకు పార్సెల్స్ సదుపాయం కూడా ఉంది.

ఏకశిల జూనియర్ కళాశాలల సెలబ్రేషన్స్



వేడుకలను ప్రారంభిస్తున్న నిట్ డైరెక్టర్ విద్యాధర సుబుద్ధి

ముఖ్య అతిథులుగా నిట్ డైరెక్టర్ విద్యాధర సుబుద్ధి, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లావుడియా

హనుమకొండ రూరల్, జనవరి 28: ఏకశిల జూనియర్ కళాశాలల స్పార్క్‌రిల్ సెలబ్రేషన్స్ హసన్‌పర్తి పెంబర్తిలోని ఏకశిల టెక్నో స్కూల్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ విద్యాధర సుబుద్ధి, ఇన్‌కం ట్యాక్స్ కమిషనర్ జీవన్‌లాల్ లావుడియా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలం విలువ గుర్తించిన వారే విజయ సోపానాలు పొందుతారని అన్నారు. ఎవరి సమయం వారికి మంచి అవకాశాలు ఇస్తుందని, దానిని సద్వినియోగం చేసుకున్నవారే విజేతలుగా నిలుస్తారని తెలిపారు.

విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. ఐఐటీ, నీట్ పోటీ పరీక్షలలో ఎంపికైన ఏకశిల విద్యార్థులకు రూ.10వేల నగదు పారితోషికం ప్రకటించారు. ఇంటర్ మొదటి సంవత్సరం టాపర్స్‌కి రెండో సంవత్సరంలో ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన ఆటపాటలు అలరించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ గౌరు రాజిరెడ్డి, బేతి కొండల్‌రెడ్డి, గౌరు సువిజ తిరుపతిరెడ్డి, ముచ్చ జితేందర్‌రెడ్డి, కళాశాలల ప్రిన్సిపాల్స్ ఇ.తిరుపతిరెడ్డి, జి.సుధాకర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణలో పది సీట్లు గెలుస్తాం..

- బీఆర్ఎస్ మూడోస్థానానికే పరిమితం
- కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలి
- కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్



అధికారులతో కలిసి పనులను పరిశీలిస్తున్న ఎంపీ సంజయ్

కమలాపూర్, జనవరి 28: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీ తెలంగాణలో పదిసీట్లు గెలుస్తామని కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ అన్నారు. కమలాపూర్ మండలంలోని ఉప్పల్ గ్రామంలోని రైల్వే గేటు వద్ద నిర్మిస్తున్న ఆర్‌వోబీ పనులను ఆదివారం సాయంత్రం రైల్వే అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. నిర్ణీత గడువులోగా బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. కొవిడ్-19, ఆర్వోబీ డిజైన్ మార్పు వల్ల నిర్మాణ పనుల్లో జాప్యం జరిగిందన్నారు. బ్రిడ్జి నిర్మాణంపై ఇదివరకు అధికారులతో రెండు, మూడు సార్లు సమీక్ష సమావేశం నిర్వహించామన్నారు. కేంద్ర ప్రభుత్వ పనులు ఆగవని, గత ప్రభుత్వం సహకరించకపోవడంతోనే నిర్మాణం అలస్యమైందన్నారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఉప్పల్ రైల్వే స్టేషన్‌లో టిక్కెట్ రిజర్వేషన్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తామని, రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్ర మాజీ మంత్రి కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకోవాలని అన్నారు. తన తండ్రి పేరు చెప్పుకొని కేటీఆర్ రాజకీయాల్లోకి వచ్చాడని, తాను పోరాటం చేసి పైకి వచ్చానని అన్నారు. తాను హిందు ధర్మం కోసం మాట్లాడితే తనను మతం పెట్టుకొమ్మని కేటీఆర్ అంటున్నాడని ఆయన ఆరోపించారు. పదే, పదే ముస్లింల గురించి మాట్లాడుతున్న కేటీఆర్ మసీదు కట్టుకొని నమాజ్ చేయాలని, ప్రజలకు అందుబాటులో లేకుండా ఫాంహౌస్‌లో ఉన్న కేసీఆర్‌కు సీఎం పదవి అవసరం లేదని బార్ కట్టుకోవాలని ఆయన విమర్శించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఏమి అభివృద్ధి పనులు చేయలేదని విమర్శించారు. కేటీఆర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్‌లు ఇద్దరు నాస్తికులు అని, నియోజకవర్గంలో మెజారిటీ ప్రజలు దేవుళ్లను పూజిస్తారని, దేవుడిని పూజించే ప్రజలు దేవుడిని నమ్మనివారికి ఓట్లు వేస్తారా? అని ఆయన ప్రశ్నించారు. ప్రధానిగా నరేంద్ర మోదీ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ పది స్థానాలను గెలుస్తుందని, బీఆర్ఎస్ పార్టీ మూడో స్థానానికే పరిమితమవుతుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గంగ్ర నళిని, కరీంనగర్ బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి, బొమ్మ శ్రీరాం చక్రవర్తి, పుప్పాల రఘు, గౌతంరెడ్డి, మాట్ల రమేష్, కట్కూరి అశోక్‌రెడ్డి, తుమ్మ శోభన్‌బాబు, సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీనివాస్, బండారి సుధాకర్, తోట సురేష్, చిట్టి సుందరయ్య, ర్యాకం శ్రీనివాస్, అంజయ్య, భూపతి ప్రవీన్, కార్యకర్తలు తదితతరులు పాల్గొన్నారు.

వైభవంగా గొంతెమ్మగుట్ట మహాజాతర



గొంతెమ్మకు బోనాలు సమర్పిస్తున్న భక్తులు

కాటారం, జనవరి 28: మండలంలోని ప్రతాపగిరి శివారు అటవీప్రాంతంలోని గొంతెమ్మ గుట్టపై మూడు రోజుల పాటు నిర్వహించిన లక్ష్మీదేవర మహాజాతర ఆదివారంతో ముగిసింది. చివరి రోజు అంగరంగ వైభవంగా జరిగింది. పలు ప్రాంతాల నుంచి వచ్చిన నాయకపోడ్ కులస్థులు, జాతర నిర్వాహకులు 15కి పైగా లక్ష్మీదేవరలతో డప్పుచప్పుళ్ల, శివసత్తుల పూనకాల మధ్య గొంతెమ్మ, లక్ష్మీదేవర పెద్ద పట్నాలు వేసి బోనాలు సమర్పించారు. అనంతరం లక్ష్మీదేవరల విన్యాసాలతో పట్నాలు తొక్కించే కార్యక్రమం చేపట్టారు. భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే దంపతులు, పలువురు పోలీసు అధికారులు, ఎంపీపీ పంతకాని సమ్మయ్య, ఎంపీటీసీలు రవీందర్‌రావు, మహేశ్వరి, విజయారెడ్డి, బోడ మమత, సర్పంచులు లక్ష్మి, దేవేందర్, రఘురాం, అశోక్, నరేష్, శేఖర్, రమేష్, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ నేతలు జాతరలో పాల్గొని దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి కరీంగనర్, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లోని పలు ప్రాంతాలతోపాటు మహారాష్ట్రకు చెందిన భక్తులు అటవీమార్గం మీదుగా ప్రైవేటు వాహనాల్లో జాతరకు తరలివచ్చారు. గుట్టపై సొరంగంలోని గొంతెమ్మ, కృష్ణుడి పాదాలు, శివలింగానికి భక్తులు మొక్కుకున్నారు. ఇరుకైన దారి గుండా భక్తులు త్వరగా వెళ్లడానికి దూసుకురాగా పోలీసులు, నిర్వాహకులు ఒక్కోసారి కొద్దిమందిని వదులుతూ దర్శనం కల్పించారు. సీఐ రంజిత్‌రావు నేతృత్వంలో ఎస్సైలు అభినవ్, సుధాకర్, నరేష్, లక్ష్మణ్‌రావు సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీస్ బలగాలతో బందోబస్తు చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ మౌనిక, గీత, సుప్రియ వైద్యసిబ్బందితో కలిసి వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గుట్టకు వెళ్లే దారి అటవీ ప్రాంతంలో ఇరుకుగా, కచ్చా రోడ్డు ఉండటంతో వచ్చిపోయే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దారి గుండా ఒకే వాహనం వెళ్లే వీలుండటంతో వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. పలువురు దాతల సహకారంతో జాతర కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రస్తుత జాతరకు ప్రభుత్వం రూ.20 లక్షల నిధులు మంజూరు చేయించిన తాత్కాలిక ఏర్పాట్లే జరిగాయని, రాబోయే జాతరకు ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించి శాశ్వతంగా అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు. పలు పార్టీల నాయకులు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, గద్దె సమ్మిరెడ్డి, అంగోత్ సుగుణ, సుజాత, వంశవర్ధన్‌రావు, తిరుపతిరావు, సురేందర్‌రెడ్డి, మధుకర్, కుమార్, కొమురయ్య, రామిళ్ల కిరణ్, రత్న సౌజన్య, జోడు శ్రీనివాస్, దబ్బెట రాజేషం, శేఖర్, రాజేంద్రాచారి తదితరులు జాతరలో పాల్గొని మొక్కులు సమర్పించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు, నాయకపోడు కళాబృందాల సాంస్కృతిక కార్యక్ర మాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాతర నిర్వాహకులు మేకల సంతోష్, గుంటి రాజేందర్, పోచం, పెద్ద కిష్టయ్య, చిన్నకిష్టయ్య, పోలం సంతోష్, సురేందర్, గుంటి రమేష్, గుంటి అశోక్, మధునయ్య మల్లేష్, ప్రతాప్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లన్నకు హారతి ఇస్తున్న వీరశైవార్చకులు

కొమురవెల్లి మల్లన్నకు లష్కర్ బోనాలు

భక్తులతో పోటెత్తిన మల్లన్న ఆలయం

చేర్యాల, జనవరి 28: కొమరవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయం లష్కర్ భక్తులతో పోటెత్తింది. మల్లన్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సంక్రాంతి తరువాత వచ్చిన రెండవవారమైన ఆదివారం రోజున సికిందరాబాదుకు చెందిన వేలాదిమంది భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. ఇలవేల్పు దైవాన్ని దర్శించుకుని పులకించిపోయారు. ఆలయ ప్రాంగణంలో విక్రయించే కూరగాయలను కొనుగోలు చేసి నూతన మట్టి కుండల్లో బోనం చేసి మల్లన్నకు నివేదించి పట్నాలు వేశారు. తమ కోరికలు నెరవేర్చమని ఆలయప్రాంగణంలోని గంగరేగుచెట్టుకు ముడుపులు కట్టారు. ఓడుబియ్యాలు పోసి తమను సల్లంగా కాపాడమని వేడుకున్నారు. తమకు సంతానం కలగాలని వేడుకుంటూ ఒళ్లబండ వద్ద వరంపట్టారు.

ఎల్లమ్మతల్లికి ఘనంగా బోనాలు

మల్లన్న సహోదరి ఎల్లమ్మదేవతకు బోనంచేసి డప్పుచప్పుళ్ల హోరుతో, పూనకంతో శివమెత్తారు. దేవతలనా మస్మరణతో గుట్టపైకి ఎక్కి బోనాన్ని సమర్పించారు. భక్తులరద్దీ అధికంగా ఉండడంతో ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. దీంతో గంటల తరబడిగా పడిగాపులు కాయడంతో తీవ్ర ఇబ్బందులుపడ్డారు. పట్నాలు వేసిన భక్తులతో గంగిరేగుచెట్టు ప్రాంగణం కిటకిటలాడింది. మొక్కుబడిగా భక్తులు కట్టిన ముడుపులతో గంగరేగుచెట్టు నిండిపోయింది. ఈవో బాలాజీశర్మ ఏర్పాట్లు పర్యవేక్షించారు. హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీశ్, చేర్యాల సీఐ సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



బోనాలు తీసుకువస్తున్న లష్కర్ భక్తులు

గ్యాస్ సిలిండర్‌లో నీరు



గ్యాస్ సిలిండర్‌ను పరిశీలిస్తున్న వినియోగదారుడు

వర్ధన్నపేట, జనవరి 28 : వంట గ్యాస్ వినియోగదారునికి వింత అనుభవం ఎదురైంది. సిలిండర్‌లో వంట గ్యాస్ ఇంధనానికి బదులు నీరు ఉండటంతో అవాక్కు అయ్యారు. వర్ధన్నపేట పట్టణానికి చెందిన ఆకుల సత్యం అనే వినియోగదారుడు ఎప్పటిలాగే గ్యాస్ బుక్ చేశాడు. సంగెం మండలంలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలిండర్ రాగానే స్టౌవ్‌కు పెట్టి వెలిగించాడు. ఎంత చూసిన మంట రాకపోవడంతో అనుమానం వచ్చి సిలిండర్‌ను పరిశీలించాడు. దీంతో గ్యాస్ సిలిండర్‌లో గ్యాస్ కాకుండా నీరు ఉండటాన్ని గమనించి నిర్ఘాంతపోయాడు. వెంటనే గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై మండిపడుతూ వారిపై చర్యలు తీసుకొని వినియోగదారులకు నాణ్యమైన సిలిండర్ అందించాలని డిమాండ్ చేశారు

వీధి కుక్కలకు చర్మవ్యాధులు

గ్రామాల్లో విచ్చలవిడిగా తిరుగున్న వైనం ● మహబూబాబాద్ జిల్లాప్రజలకు పొంచి ఉన్న ముప్పు



మరిపెడ (మహబూబాబాద్ జిల్లా), జనవరి 28 : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మునిసిపల్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వీధికుక్కలు చర్మ వ్యాధుల బారిన పడి భయానక వాతావరణం సృష్టిస్తున్నాయి. ఏ గల్లీకి వెళ్లినా వ్యాధి బారిన పడిన కుక్కలే దర్శనమిస్తున్నాయి. కుక్కలకు సోకిన వ్యాధితో మానవాళి మనుగడకు సైతం భారీ ప్రమాదం వాటిల్లే అవకాశాలున్నాయి. విచ్చలవిడిగా వ్యాధుల బారిన కుక్కలచే రోగాలు వ్యాప్తి చెందే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. యుద్ధ ప్రతిపాదికన నివారణ చర్యలు తీసుకోవాల్సిన అధికార యంత్రాంగం నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తోంది. గ్రామ పంచాయతీల్లో అరకొరగా నిధులు ఉండటంతో సర్పంచ్‌లు సైతం చేతులెత్తేస్తున్నారు. కరోనా మహమ్మారి బారినుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న ప్రజలకు కుక్కల ద్వారా మరో ప్రమాదం ముంచుకొస్తుందనే ఆందోళనతో కొట్టుమిట్టాడుతున్నారు.

మరిపెడ, చిన్నగూడూరు, నర్సింహులపేట, దంతాలపల్లి, కురవి తదిరత మండలాల పరిధిలోని ఏ గ్రామంలోకి వెళ్లిన చర్మ వ్యాధుల బారిన పడిన వీధి కుక్కలు దర్శనమిస్తున్నాయని జనం వాపోతున్నారు. కుక్కలకు చర్మ వ్యాధుల నివారణ చర్యలు తీసుకోవాల్సిన జిల్లాలోని మున్సిపాలిటీలు,



గ్రామ పంచాయతీలు నిధుల కొరతతో వీధికుక్కల నిర్మూలనను గాలికొదిలేస్తున్నారు. కుక్కల చర్మ వ్యాధుల ద్వారా ప్రజలకు ప్రమాదం జరుగక ముందే రక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో పలువురు బాధితులు

మహబూబాబాద్ జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 461 గ్రామపంచాయతీలు ఉండగా, రెండు నెలలుగా కుక్క కాటుకు గురైన వారు అనేక మంది ఉన్నారు. చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలోనే 12 మందిని ఒకేరోజు ఊర కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. జిల్లా వ్యాప్తంగా గత సంవత్సరం మార్చి మాసం నుంచి డిసెంబరు వరకు 21 పీహెచ్‌సీల పరిధిలో సుమారు 4,000మందికి పైగా కుక్క కాటుతో గాయపడ్డారు. మరిపెడ మండలానికి చెందిన ఓ వ్యక్తి కుక్క కాటుకు గురియై ఇటీవలనే హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

జాగ్రత్త వహించడమే ఏకైక మార్గం

రమేశ్, వెటర్నరీ డాక్టర్, ఎడ్జర్ల



చర్మ వ్యాధుల బారిన పడ్డ కుక్కల పట్ల ప్రజలు జాగ్రత్తలు వహించడం ఒక్కటే మార్గం. వీధి కుక్కలకు సోకిన చర్మ వ్యాధుల నివారణకు ప్రభుత్వం నుంచి మందుల సరఫరా లేదు. కుక్కల సొల్లుద్వారా రేబీస్ వ్యాధి వ్యాప్తి చెందే ప్రమాదం ఉంది. గ్రామ పంచాయతీ సిబ్బందికి, ప్రజలకు అవగాహన కల్పించి తగు జాగ్రత్తలు పాటించాలి. వీటితో పాటు కుక్కలకు సోకిన చర్మవ్యాధి నివారణకు ఐవర్‌మెక్టిన్ అనే లిక్విడ్, మాత్రలను ఏదైన మాంసంలో కలిపి కుక్కలకు వారం రోజుల పాటు క్రమం తప్పకుండా అందజేసినట్లైయితే వ్యాధి ప్రభలకుండా కొంత వరకు అదుపు చేయవచ్చు.

సైనిక్ స్కూల్ తరలిస్తే సహించేది లేదు

● గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కొనసాగించాలి ● స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 28: స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గానికి గత ప్రభుత్వం ఉన్నప్పుడు వచ్చిన సైనిక్ స్కూల్‌ను ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తరలించుకుపోవాలని చూస్తే సహించేది లేదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి హెచ్చరించారు. ఆదివారం డివిజన్ కేంద్రంలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు హెల్త్ యూనివర్సిటీని, వెటర్నరీ కళాశాలను, అగ్రికల్చర్ కళాశాలను, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌ను, సైనిక్ స్కూల్‌ను తీసుకువచ్చానని అన్ని కళాశాలలు ప్రారంభమైనప్పటికీ సైనిక్ స్కూల్ మాత్రం ప్రారంభం కాలేదన్నారు. 2016లో ధర్మసాగర్ మండలంలోని ఎలుకుర్తిలో 49.32 ఎకరాల భూమిని పరిశీలించడం జరిగిందన్నారు. తదనంతరం సైనిక్ స్కూల్ ఏర్పాటుకు 2017లో అప్పటి ప్రభుత్వానికి, డిఫెన్స్ మినిస్ట్రీకి మధ్య ఒప్పందం కుదిరిందన్నారు. కాగా కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణకు మరో సైనిక్ స్కూల్ కావాలని కోరగా కేంద్రం అందుకు అంగీకారం తెలుపలేదని తెలిసింది. దీంతో వరంగల్‌లో నెలకొల్పబడుతున్న సైనిక్ స్కూల్‌ను సికింద్రాబాద్ పరిధిలోని కంటోన్మెంట్ ప్రాంతానికి తరలించాలని కోరుతూ రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ప్రభుత్వానికి నివేదిక పంపించడం దురదృష్టకరమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వరంగల్‌కు మంజూరైన సైనిక్ స్కూల్‌ను వరంగల్‌లోనే నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కేంద్రం నూతనంగా 100 సైనిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తుందని వాటిలో తెలంగాణకు కొత్తగా తీసుకువచ్చి ఎక్కడైన ఏర్పాటు చేసుకున్న అభ్యంతరం లేదన్నారు. గత ప్రభుత్వం కాలంలో స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి వివిధ అభివృద్ధి పనుల కోసం రూ 278 కోట్ల నిధులు మంజూరి చేసిందని వాటితో జరిగే పనులు ప్రస్తుత ప్రభుత్వం కొనసాగేలా చూడలన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన పనులను చేయకుండా ఆపాలని చూస్తే నియోజకవర్గ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రస్తుత సర్పంచులు గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేశారని వారి కాల పరిమితి ఈ నెల 31తో ముగుస్తున్నందున వారి కాల పరిమితిని 6 నెలల కాలం పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైసు మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెలిదె వెంకన్న, రాష్ట్ర నాయకులు రాపోలు మధుసూదన్‌రెడ్డి, బూర్ల శంకర్, నీల గట్టయ్య, కనకం రమేష్, ఎంపీటీసీలు గన్ను నర్సింహులు, రజాక్‌యాదవ్, నాయకులు ఐలోని సుధాకర్‌గౌడ్, దుంపల పద్మారెడ్డి, కందుల గట్టయ్య, సౌదరపల్లి సంపత్‌రాజ్, తోట సత్యం తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు సహకరిస్తా..



సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

బీఆర్ఎస్ పార్టీ సమావేశంలో పాల్గొని హనుమకొండకు వెళుతున్న క్రమంలో శివునిపల్లి గ్రామంలో రోడ్ల పైన కూరగాయలు అమ్ముతున్న మహిళల వద్ద కారును ఆపి వారితో కడియం ముచ్చటించారు. రోడ్డు పైన ఇరువైపుల కురగాయలు అమ్ముతున్న మహిళల దగ్గరకు వెళ్లి వారిని పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని మహిళలు కోరగా సమస్య లేకుండా చూస్తానని కడియం మహిళలకు హామీ ఇచ్చారు

తూకంలో తేడా రావొద్దు

- జిల్లా మెట్రాలజీ అధికారి శ్రీనివాసులు


మటన్ షాపులో కాంటాలను పరిశీలిస్తున్న శ్రీనివాసులు

జనగామ టౌన్, జనవరి 28: వ్యాపారులు తూకం విషయంలో వినియోగదారులను మోసం చేస్తే కఠిన చర్యలుంటాయని జిల్లా మెట్రాలజీ అధికారి వల్లపు శ్రీనివాసులు హెచ్చరించారు. ఆదివారం ఆయన జనగామ పట్టణంలోని మాంసం విక్రయాలు, కూరగాయల దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. తూకం వేసే బాట్లు సరైన క్వాంటిటీ ఉన్నాయో లేదో పరిశీలించారు. తూకంలో మోసం చేస్తున్న 12 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముద్ర వేయని తూనిక యంత్రాలు, తూకపు రాళ్లు ఉపయోగించడం చట్టరీత్యా నేరమన్నారు. ఉత్పత్తుల ప్యాకేజీలపై చిరునామా, కంపెనీ పేరు, తేదీని గరిష్ఠ చిల్లర ధర, కస్టమర్ కేర్ వివరాలు తప్పనిసరిగా ముద్రించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లైసెన్సు హోల్డర్లు సీహెచ్.పరమేశ్వర్, మహిపాల్‌రెడ్డి, సతీశ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్థుల సహకారంతోనే సమగ్రాభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న సర్పంచ్ పుట్ట అంజనీదేవి రవీందర్ రెడ్డి

చిలుపూర్, జనవరి 28 : గ్రామస్థుల సహకారంతోనే గ్రామ సమగ్రాభివృద్ధి సాధ్యమని సర్పంచ్ పుట్ట అంజనీదేవి రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కృష్ణాజీగూడెంలో, రూ 20 లక్షల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన నూతన జీపీ భవనాన్ని వార్డు సభ్యులు, గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాదం రవి, వార్డు సభ్యులు సాదం రాజు, పోలు స్వరూప, సాదం రేణుక, స్వరూప, మూడికె సమ్మక్క, రమేష్, మారపాక వెంకటేశ్వర్లు, మారపాక రేణుక, వేముల వెంకటేశ్వర్లుతో పాటు, గ్రామస్థులు వడ్లకొండ లక్ష్మయ్య, మారపాక సదానందం, సాదం మచ్చ మల్లేష్ పాల్గొన్నారు. కాగా, తమకు కనీస సమాచారం ఇవ్వకుండానే జీపీ భవనాన్ని సర్పంచ్ అంజనీదేవి ఆగమేఘాల మీద ప్రారంభించడం ఎంతవరకు సమంజసమని ఎంపీటీసీ నర్సింహులు ప్రశ్నించారు. మండల స్థాయి అధికారులు, కోఆప్షన్ సభ్యులకు సైతం కనీస సమాచారమివ్వని సర్పంచ్‌పై తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ... తాము కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

రొండ్ల లక్ష్మారెడ్డి సేవలు మరువలేనివి

విశ్రాంత ఐఏఎస్ అధికారి అరవింద్‌రెడ్డి


లక్ష్మారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అరవింద్‌రెడ్డి

లింగాలఘణపురం, జనవరి28: జనగామ మాజీ ఎమ్మెల్యే దివంగత రొండ్ల లక్ష్మారెడ్డి ప్రజలకు అందించిన సేవలు శ్లాఘనీయమని విశ్రాంత ఐఏఎస్ అధికారి అరవింద్‌రెడ్డి అన్నారు. ఆదివారం లింగాలఘణపురం మండల కేంద్రంలో దివంగత మాజీ ఎమ్మెల్యే రొండ్లలక్ష్మారెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి స్థానిక సర్పంచ్ సాదం విజయమనోహర్ అధ్యక్షత వహించగా అరవింద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవలో నిత్యం బిజీగా ఉండే లక్ష్మారెడ్డి ప్రజానాయకుడు ప్రజల హృదయాల్లో చెరగని స్థానాన్ని నిలుపుకున్నారన్నారు. లింగాలఘణపురం మండల ఏర్పాటుకు లక్ష్మారెడ్డి కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిట్ల జయశ్రీఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పోరెడ్డి మల్లారెడ్డి, రెడ్డి సంక్షేమసంఘం నాయకులు ఐలేని ఆగిరెడ్డి, రొండ్ల నర్సిరెడ్డి, దామోదర్‌రెడ్డి, సుహాసిని, రాంచంద్రారెడ్డి, రాజిరెడ్డి, మార్పు శ్రీనివాస్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఏదునూరి వీరయ్య దారం అశోక్, గవ్వల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

గడ్డం సమ్మయ్య ప్రదర్శనలు అద్భుతం

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు


సమ్మయ్యను సన్మానిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, జనవరి 28: మండలంలోని అప్పిరెడ్డిపల్లెకు చెందిన చిందుయక్షగాన కళాకారుడు, కళారత్న, హంస, పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్యను ఆదివారం రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఎస్.సుధాకర్‌రావులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ సమ్మయ్య నిరుపేద కుటుంబంలో జన్మించి చిందు యక్షగానంపై ఆసక్తి చూపి కుటుంబపోషణకోసం ప్రదర్శనలు ఇచ్చి పొట్టగడుపుకునే వాడన్నారు. ప్రదర్శనల ద్వారాప్రజలను ఆకట్టుకుంటూ మన్ననలు పొందేవారన్నారు. సమ్మయ్య ప్రదర్శనల పట్ల చూపిన ఆసక్తే నేడు పద్మశ్రీ లభించిందన్నారు. సమ్మయ్య పాలకుర్తి నియోజకవర్గం వారు కావడం కేంద్రం పద్మశ్రీ ప్రకటించడం చాలా ఆనందంగా ఉందన్నారు. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్‌రావు మాట్లాడుతూ సమ్మయ్య ప్రదర్శనలు ఇస్తూ, ఎంతోమందికి శిక్షణ ఇచ్చి చిందుకు ఆజ్యం పోశాడన్నారు. అంచెలంచెలుగా సమ్మయ్య ఎదిగి పేదరికాన్ని పారద్రోలాడన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, జిల్లా నాయకులు చామల విక్రమ్‌రెడ్డి, పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, బబ్బూరి శ్రీకాంత్, మండల నాయకులు చింత రవి, మొలుగూరి రమేష్, సంజీవరెడ్డి, ఏల సుందర్, వంగ అర్జున్, కాశీం, కోతి ప్రవీణ్, గడ్డం రాజు, యాదగిరి, సమ్మయ్య కుమారులు సోమరాజు, హిమగిరి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం పెంపుదల


క్రీడాకారులకు బహుమతి అందజేస్తున్న పొట్లపల్లి శ్రీధర్‌రావు

చిలుపూర్, జనవరి 28 : క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతోందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్, చిలుపూర్ ఆలయ శాశ్వత దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పల్లగుట్టలో ఆయన తండ్రి, తెలంగాణ తొలిదశ ఉద్యమకారుడు పొట్లపల్లి చక్రధర్‌రావు స్మారకార్థం నిర్వహించిన కబడ్డీ క్రీడా ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విజేతగా నిలిచిన జట్లకు షీల్డుతో పాటు, నగదును బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ మండల, జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో అద్భుతమైన ప్రతిభను కనబరుస్తున్న క్రీడాకారులు రాష్ట్ర స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు గౌడ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు ఎనగందుల రత్నాకర్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ చల్లారపు శ్యామ్, మాజీ సర్పంచ్ పేరాల సుధాకర్, జీడి ఆనందం, ఎమ్డీ రఫీ, గుర్రం రమేష్, క్రీడాకారులు ఐలపాక మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


చిలుపూర్ 1998 -99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు


ఛాగల్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చిలుపూర్, జనవరి 28 : మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో చిలుపూర్ ప్రభుత్వ ఉన్నత పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థులు, స్థానిక ఉప సర్పంచ్ పిట్టల మహేందర్, చిలుపూర్ గుట్ట మాజీ చైర్మన్ మూల నాగరాజు నేతృత్వంలో జరిగిన సమ్మేళనానికి 1998 -99 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులంతా హాజరయ్యారు. అంతకు ముందు బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో మాచెర్ల శ్రీనివాస్, నారగోని రవి, సోమ రవి, మచ్చకంటి ప్రకాశ్, మాచెర్ల రాములు, పులి రాజ్ కుమార్, కొయ్యడ శ్రీనివాస్, ఇస్లావత్ రాజు, శ్రీధర్, శంకర్, స్వప్న, ఉమ, నసీం, పరమేశ్వరి, శిరీష, కవిత, నాగమణి, రజిత, రంజిత్, కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఛాగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005-06 సంవత్సరంలో పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 18 ఏళ్ల తరువాత విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల నీడలో కలుసుకొని చిలిపి చేష్టలను కొంద గుర్తులను గుర్తు చేసుకొని మురిసిపోయారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో సదానందచారి, ఉపాధ్యాయులు దూడయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఈశ్వరయ్య, మైసయ్య, జయమ్మ, ఫాతిమా, విద్యార్థులు ఎలిశాల రాము, రాజు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 7న చలో ఢిల్లీ

జనగామ టౌన్, జనవరి 28: కరెన్సీపై అంబేద్కర్ ఫొటో ముద్రించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7, 8, 9 తేదీల్లో న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరిపోతుల పరశురామ్ తెలిపారు. ఇందుకు సంబంధించి జనగామ ఆర్టీసీ చౌరస్తాలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుగ్గిల్ల నర్సయ్య గట్టగ్గల సంజీవ, పులి శేఖర్, తిప్పారపు ప్రసాద్, సురేశ్, ఎల్లేశ్, కడారి శ్రీను, మేడ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలకుర్తికి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి రాక

పాలకుర్తి, జనవరి 28 : మండల కేంద్రంలో కళ్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి సోమవారం పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి హాజరవుతున్నారని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి లబ్ధిదారులు హాజరుకావాలని కోరారు.

రియల్ ఎస్టేట్ యూనియన్ నూతన కమిటీ


నూతన కార్యవర్గం ఇదే

జనగామ టౌన్, జనవరి 28: రియల్ ఎస్టేట్ యూనియన్ జనగామ జిల్లా నూతన కమిటీని ఆదివారం పట్టణంలోని దుర్గమ్మ గుడి ఆవరణలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందాడి శ్రీనివాస్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా పాషం శ్రీశైలం, గుంటుక దామోదర్, ఉపాధ్యక్షుడిగా బక్క శ్రీను, ప్రధాన కార్యదర్శిగా ఎండీ.అబుల్ ఖాదర్, సంయుక్త కార్యదర్శిగా బొమ్మకంటి శ్రీధర్, కోశాధికారిగా బత్తిని నర్సింహులు ఎన్నికయ్యారు.

పట్టభద్రులు ఓటును నమోదు చేసుకోవాలి

జఫర్‌గడ్, జనవరి 28 : అర్హులైన పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని జఫర్‌గడ్ తహసీల్దార్ అంబటి ఆంజనేయులు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. వరంగల్ -ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికలు జరగనున్న దృష్ట్యా జాబితాలో ఓటరు నమోదు కోసం గ్రాడ్యుయేట్లు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2020, నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తి చేసిన వారితో పాటు గతంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ దరఖాస్తు చేయాలని సూచించారు. నమోదుకు గాను డిగ్రీ ఉత్తీర్ణత మెమో, ఓటరు ఐడీ, ఆధార్ కార్డు ధృవీకరణ పత్రాలతో పాటు పాసు పోర్టుసైజ్ ఫొటోతో గెజిటెడ్ అధికారిచే ధృవీకరించబడిన ఆ పత్రాలను ఆన్‌లైన్ ద్వారా లేదా నేరుగా తహసిల్దార్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటరుగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఈ సదవకాశాన్ని అర్హులైన పట్టభద్రులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రెండు గ్రామాల్లో కాంగ్రెస్ కమిటీలు ఎన్నిక

నర్మెట, జనవరి 28 : మండలంలోని కన్నెబోయినగూడెం, వెల్దండ గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వెల్దండ గ్రామ అధ్యక్షుడిగా పొనబోయిన బాలనర్సు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గోల్కొండ శివకుమార్, మహిళ అధ్యక్షురాలిగా ధరావత్ లక్ష్మి, వెల్దండ గ్రామ అధ్యక్షుడిగా గోల్కొండ నర్సింహులు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మార్క మహేష్, మహిళ అధ్యక్షురాలిగా అగమల్ల పద్మలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి పాల్గొని మాట్లాడారు. రెండు గ్రామాల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్‌లో ఉచిత వైద్య శిబిరం

జఫర్‌గడ్, జనవరి 28 : ప్రజారోగ్య రక్షణ కోసం ఆదివారం జఫర్‌గడ్ మండల కేంద్రంలో హనుమకొండ గ్రావిడ్ హోం హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని జఫర్‌గడ్ ఎస్ఐ మహేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, స్టేషన్‌ఘన్‌పూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మంచాల ఎల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలు, మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. కాగా, ఈ శిబిరంలో మహిళలు, పురుషులకు ఉచితంగా పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై వైద్యులు వారికి వివరించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ దీప, రమ్య, భార్గవి, మాజీ సర్పంచ్ గాదరి బాబు, పానుగంటి సోమయ్య, అనిల్, రాజయ్య, వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి



కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న ఔట్ సోర్సింగ్ అధ్యాపకులు

జనగామ టౌన్, జనవరి 28: తమకు ఉద్యోగ భద్రత కల్పించే విషయమై సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఔట్ సోర్సింగ్ అధ్యాపకులు ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. శనివారం రాత్రి జనగామకు వచ్చిన కోదండరాంను తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాలయాల టీచర్లు, లెక్చరర్లు కలిసి వినతిపత్రం ఇచ్చారు. పీఆర్‌సీ ఏరియర్స్, 12 నెలల జీతం, ఉద్యోగ భద్రత సమస్యలను పరిష్కరించాలని కోరారు. సోమేశ్వరాచారి, సాదిక్ అలీ, జి.కృష్ణ, ప్రభాకర్, సాయికిరణ్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..


ప్రమాదకరంగా పబ్లిక్ నల్లా పక్కనే ఉన్న ఐరన్ కరెంట్ స్తంభం

స్టేషన్‌ఘన్‌పూర్, జనవరి 28: మండలంలోని తాటికొండ జీపీ కార్యాలయం ఎదుట మిషన్‌భగీరథ పబ్లిక్ కులాయి పక్కనే ఐరన్ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. కులాయి నీటి కోసం నిత్యం సమీపంలోని గృహాలకు చెందిన వారు బిందెలతో అక్కడికి వచ్చి నీళ్లు పట్టుకొని వెళుతుంటారు. కులాయి పక్కనే ఐరన్‌పోల్ ఉండడంతో తరుచుగా ఎర్త్‌కరెంట్ సరఫరా కావడంతో తాగునీరు కోసం వచ్చే మహిళలు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదవశాత్తు కరెంట్ సరఫరా అయితే తాగునీరు కోసం వచ్చే మహిళలు విద్యుదాఘాతానికి గురయ్యే ప్రమాదం ఉందని వెంటనే సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఐరన్‌పోల్‌ను తొలగించాలని కోరుతున్నారు. నిత్యం పదుల సంఖ్యల అక్కడికి వచ్చి నీళ్ల తీసుకువెళ్లడమే కాకుండా జీపీ ఎదుటనే కాబట్టి నిత్యం ప్రజలు రద్దీగా అక్కడికి వస్తుంటారు. ఈ క్రమంలో అధికారులు వెంటనే ఐరన్ పోల్‌ను వెంటనే తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు గ్రామస్థులు చేస్తున్నారు.

విద్యాసంస్థల్లో మేటి 'సెయింట్‌పాల్స్'

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ టౌన్, జనవరి 28: విద్యారంగంలో జనగామ జిల్లాలో మేటిగా నిలుస్తున్నది 'సెయింట్ పాల్స్' పాఠశాల అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జనగామ పట్టణంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అట్టహాసంగా జరిగాయి. ఐ యామ్ సో హ్యాపీ అంటూ నర్సరీ పిల్లలు చేసిన నృత్య ప్రదర్శనల అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. జనగామ పట్టణంలో సుదీర్ఘకాలం నుంచి విద్యనందిస్తూ అనేక మంది విద్యార్థులను ప్రయోజకులుగా తీర్చిదిద్దుతున్న సెయింట్‌పాల్స్ యాజమాన్యాన్ని అభినందించారు. 25 ఏళ్ల ప్రస్థానంలో ఈ పాఠశాల ఎన్నో మైలురాళ్లు అధిగమించిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో రాము, మునిసిపల్ చైర్‌పర్సన్ జమున, వైస్ చైర్‌పర్సన్ రాంప్రసాద్, సీఐ శ్రీనివాస్‌యాదవ్ కౌన్సిలర్ బండ పద్మ, పాఠశాల యాజమాన్యం ఫాదర్ ఎం.జయపాల్, ఫాదర్ టి.ఆగస్టిన్‌రెడ్డి, ఫాదర్ ఆర్.ఇన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సిల్వర్ జూబ్లీ వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లా